ఇసుక రవాణా జోరు..


మామిడిపల్లిలోని మూలవాగు


ఇసుక రవాణాతో కుంగిన వంతెన

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- పొలాలకు కోత
- రైతన్నల ఆందోళన

కోనరావుపేట: ఇసుక రవాణా కొందరికి కాసులు కురిపిస్తుంటే.. మరికొందరి జీవనోపాధిని దెబ్బతీస్తోంది. ఇసుక రవాణాతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, పొలాలు కోతకు గురవుతున్నాయని రైతులు ఆందోళన చేస్తున్నారు. ఇసుక రీచ్‌లను అడ్డుకుంటున్నారు.

4 ఇసుక రీచ్‌లు..

ఇసుకకు ప్రధాన వనరైన మూలవాగు కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో ప్రవహిస్తోంది. నిమ్మపల్లి, కొండాపూర్, బావుసాయిపేట, వట్టిమల్ల, వెంకట్రావుపేట, నిజామాబాద్, మామిడిపల్లి, కనగర్తి గ్రామాలు మూలవాగు పరివాహక పల్లెలుగా ఉన్నాయి. ఈ గ్రామాల శివారులోని మూలవాగు నుంచే ఇసుక రవాణా జరుగుతోంది. రెవెన్యూ అధికారులు మామిడిపల్లి, కనగర్తి, వెంకట్రావుపేట, నిమ్మపల్లి గ్రామాల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశారు. ఈ గ్రామాల నుంచే ఇసుకను తీసుకెళ్లొచ్చని అనుమతులిస్తున్నారు.

రైతుల ఆందోళన

మూలవాగు పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన రీచ్‌ల ద్వారా పెద్దఎత్తున అధికారికంగా రవాణా జరుగుతోంది. ఒక్కరోజు వ్యవధిలో సుమారు 400–500 ట్రిప్పుల ఇసుక రవాణా కావడంతో.. భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని మామిడిపల్లి, కనగర్తి, లింగంపెల్లి, మల్లారం, హన్మాజీపేట తదితర గ్రామాల రైతులు ఆందోళన చేస్తున్నారు.

వందల ట్రాక్టర్లు..



రెవెన్యూ అధికారులు మామిడిపల్లిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేశారు. ఇసుక కోసం వందల ట్రాక్టర్లు వస్తున్నాయి. ఇసుక కోసం తవ్వన గోతులు పెద్దగా ఉండడంతో వాగు ప్రవహించినప్పుడు మా పొలాలు కోతకు గురవుతున్నాయి. ఇప్పటికే కొంతమంది రైతుల పొలాలు కోతకు గురయ్యాయి.
– పెద్దోళ్ల శంకర్, మామిడిపల్లి

ఇసుక రీచ్‌ను తొలగించాలి



ఇసుక రీచ్‌తో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ఇసుక రీచ్‌తో పొలాలు కోతకు గురవుతున్నాయి. ఇసుక రవాణాతోనే వంతెన కుంగింది. అందుకే ఇసుక రీచ్‌ను అడ్డుకున్నాం. అధికారులు మా సమస్యలను గుర్తించి ఇసుక రీచ్‌ను తొలగించాలి.
– లోకుర్తి శంకర్, మామిడిపల్లి

సమీక్షిస్తున్నాం..

కోనరావుపేట మండలంలో ఇప్పటివరకు నాలుగు ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేశాం. పలు గ్రామాల్లో రైతులు అభ్యంతరం చెబుతున్నారు. ఇసుక రీచ్‌లను అడ్డుకుంటున్నారు. మైనింగ్ అధికారులతో కలిసి ఈ విషయంపై సమీక్షిస్తున్నాం. వేరే ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తాం.
– విజయప్రకాశ్‌రావు, తహసీల్దార్

యుద్ధ ప్రాతిపదికన మినీ స్టేడియం పనులు

వేములవాడ: తిప్పాపూర్‌లో నిర్మాణంలో ఉన్న మినీ స్టేడియం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించేందుకు కృషి చేస్తానని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని బాలానగర్ గ్రౌండ్‌లో స్థానిక ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. జిల్లాస్థాయి క్రికెట్ పోటీల ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం అన్ని గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రెస్ క్లబ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం సనుగుల గ్రామ శివారులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజులస్వామికి విప్ ఆది శ్రీనివాస్ తన కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆది శ్రీనివాస్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తిరుగు ప్రయాణంలో రామరావుపల్లె బీరప్ప దేవాలయాన్ని దర్శించుకున్నారు. చందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, సనుగుల సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ముష్కు ముకుందరెడ్డి, జోగాపూర్ ఎంపీటీసీ సభ్యుడు మ్యాకల గణేశ్, సింగిల్‌విండో డైరెక్టర్లు కేతిరెడ్డి నాగిరెడ్డి, ముస్కు అజయ్, మాజీ సర్పంచులు ముష్కు శ్రీనివాస్‌రెడ్డి, ఆది రవి, ఆయిల్నేని కమలాకర్‌రావు, నాయకులు భీంరాజు కనకరాజు, ఏగోలపు కిష్టస్వామి తదితరులున్నారు.

నిత్య సాధనతో ఆంగ్ల భాషపై పట్టు

సిరిసిల్లకల్చరల్: నిరంతర సాధనతో ఆంగ్ల భాషా నైపుణ్యాలపై పట్టు సంపాదించాలని మండల విద్యాధికారి దూస రఘుపతి అన్నారు. శుక్రవారం పద్మశాలీ అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న స్పోకెన్ ఇంగ్లిష్ ఉచిత శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. కాలానుగుణంగా వస్తున్న మార్పుల్లో భాగంగా ఇంగ్లిష్ భాష ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో ప్రతి విద్యార్థి భాషపై పట్టు పెంచుకోవాలన్నారు. ప్రాథమిక అంశాలపై నెల రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను నిరంతరం సాధన చేయాలని సూచించారు. పది మందికి పైగా ఆంగ్ల భాషా నిపుణులు తమ సేవలు అందించినందుకు పోపా తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఆయా భాషా నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో పోపా కార్యదర్శి పున్నం చందర్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బూర శ్రీనివాస్, గాజుల ప్రతాప్, మచ్చ ఆనందం, వాసాల హరిప్రసాద్, ఆడెపు వేణు, చేరాల తిరుపతి, కోడం పూర్ణిమ, బైరి రమాదేవి, కనుకుంట్ల తిరుమల, లకుం సదానందం, కోడం దత్తు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో పోపా ప్రతినిధులు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి


ఆర్థిక సాయం అందిస్తున్న ధర్మయ్య

ఎల్లారెడ్డిపేట: సింగారంకు చెందిన బొమ్మడి నారాయణ, ముత్యాల బాలకిషన్ అనే ఇద్దరు విద్యుదాఘాతంతో ఒకే ఏడాదిలో మరణించగా.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. గ్రామానికి చెందిన బంగ్లా ధర్మయ్య అనే సామాజిక కార్యకర్త శుక్రవారం మృతుల కుటుంబాలను పరామర్శించి గ్రామంలోని ఏడుగురు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1,500 నగదుతోపాటు 50 కిలోల బియ్యం అందించి ఉదారతను చాటుకున్నారు.

‘సన్న’గిల్లిన బోనస్ ఆశలు!

- సన్న రకం వడ్లకే రూ.500 బోనస్
- ఈ వానాకాలం సీజన్ నుంచే అమలు
- ప్రభుత్వ ప్రకటనతో రైతుల్లో నిరాశ
- జిల్లాలో అధికంగా దొడ్డు రకం వరి సాగు


రైతులు సాగు చేసిన దొడ్డు రకం వరి

గంభీరావుపేట: సన్న రకం వరి సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. ఈ వానాకాలం సీజన్ నుంచి అమలు చేస్తామని చెప్పింది. ఈ నేపథ్యంలో సన్నాలకే బోనస్ ప్రకటించి దొడ్డు రకం వడ్లకు ప్రకటించకపోవడంపై రైతులు నిరాశ చెందుతున్నారు. అన్ని రకాల వడ్లకు బోనస్ లభిస్తుందని ఆశించిన అన్నదాతలకు నిరాశ ఎదురైంది. జిల్లాలో అధికంగా దొడ్డు రకం వడ్లనే పండిస్తారు. యాసంగి సీజన్‌లో జిల్లాలో 1.73లక్షల ఎకరాల్లో వరి పంట సాగైంది. వీటిలో 80 శాతం దొడ్డు రకం వడ్లనే సాగు చేశారు. 20 శాతం మాత్రమే సన్న రకం వడ్లు సాగు చేశారు. ఏటా ఇదే పరిస్థితి. ప్రస్తుతం ప్రభుత్వం బోనస్ అంశాన్ని తెరపైకి తేవడంతో సర్వత్రా సన్న రకం వడ్ల సాగు అంశంపై చర్చ సాగుతోంది. నర్మాల ఎగువ మానేరు ప్రాజెక్టు ఆధారంగా జిల్లాలో అధికంగా దొడ్డు రకం వడ్లనే సాగు చేస్తారు.

పెట్టుబడి కలిసొస్తుందని..

రైతులు ఎక్కువగా దొడ్డు రకానికి మొగ్గు చూపుతారు. సన్న రకం వడ్ల పంట కాలం ఎక్కువ. నీటి వినియోగం అధికం. దిగుబడి తక్కువ. అంతేకాకుండా చీడపీడలు, తెగుళ్ల బారిన పడే అవకాశం అధికం. సన్నాల సాగుకు పెట్టుబడి భారమూ ఎక్కువే. ఈ కారణాలతో రైతులు సన్నాల సాగుకు మొగ్గు చూపడం లేదు. సన్న రకం వడ్లకు బహిరంగ మార్కెట్లో డిమాండ్ ఎక్కువగానే ఉంటుంది. ప్రభుత్వం అందించే మద్దతు ధర కంటే ఎక్కువగానే లభిస్తుంది. అధికంగా సాగయ్యే దొడ్డు రకానికి కాకుండా తక్కువగా సాగయ్యే సన్నాలకు ప్రభుత్వం బోనస్ ప్రకటించడంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

దొడ్డు వడ్లకూ ఇవ్వాలి



ఎన్నికల ముందు వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు తక్కువ సాగయ్యే సన్న రకాలకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదు. సన్నాలు సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు పెరుగుతుంది. ప్రభుత్వం పునరాలోచన చేసి అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి.
– కోడె రమేశ్, గంభీరావుపేట

సన్నాలు సరిగా పండవు



ప్రభుత్వం సన్న రకం వడ్లకే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదు. 99 శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. చాలా రకం భూముల్లో సన్నాలు పండవు. అన్ని రకం వడ్లకూ బోనస్ ఇవ్వాల్సిందే. లేకుంటే రైతులకు అన్యాయం చేసినవారవుతారు. సర్కారు నిర్ణయం మార్చుకోవాలి.
– గౌటే గణేశ్, కొత్తపల్లి

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా ఫైన్‌ఆర్ట్స్ కళాశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి వివిధ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రజిని తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బీఏ హానర్స్ విభాగంలో ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ డిజైనింగ్, ఫొటోగ్రఫీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గిరిజన, గిరిజనేతర విద్యార్థినులు ఈనెల 13 లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్, ఇంటర్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న లక్ష్మీనర్సింహారావు

వేములవాడరూరల్: బీఆర్‌ఎస్ వేములవాడ పట్టణ ప్రధాన కార్యదర్శి కందుల క్రాంతికుమార్ తండ్రి శంకర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా.. శుక్రవారం బీఆర్‌ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట సీనియర్ నాయకుడు రాఘవరెడ్డి, కౌన్సిలర్ జోగిని శంకర్, శేఖర్, గోలి మహేశ్, ఎంపీపీ చంద్రయ్యగౌడ్, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్‌రావు, నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్‌గౌడ్, రాజు, సందీప్, రాము, ప్రమోద్, రాకేశ్, సాయి తదితరులున్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

కోనరావుపేట: మర్తనపేటలో విద్యుదాఘాతంతో మృతిచెందిన ముంద్రాయి సందీప్‌కుమార్ కుటుంబాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, నాయకులు సంకినేని నిరంజన్‌రావు, తాళ్లపెల్లి ప్రభాకర్ తదితరులు కూడా పరామర్శించారు.

బస్సుల కొరత లేకుండా చూడాలి


మాట్లాడుతున్న గజ్జెల ప్రశాంత్

వీర్నపల్లి: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం హర్షణీయమని, కానీ ఆ మహిళలు ప్రయాణించడానికి వీలుగా బస్సుల కొరత లేకుండా చూడాలని సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. వన్‌పల్లి–సిరిసిల్ల రూట్‌లో అదనపు బస్సు నడపాలన్నారు.

రక్తదానం


రక్తదానం చేస్తున్న రాఘవేంద్ర

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రానికి చెందిన నాంపెల్లి అనే వ్యక్తికి అత్యవసరంగా బి–పాజిటివ్ రక్తం అవసరం పడింది. విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డిపేటకు చెందిన రాఘవేంద్ర అనే యువకుడు వెంటనే సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి వెళ్లి నాంపెల్లికి రక్తమందించాడు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రమాకాంత్ అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

వేములవాడరూరల్: బీడీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధి రాములు అన్నారు. వేములవాడలోని దేశాయి బీడీ సెంటర్‌ను సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకొని మాట్లాడారు. బీడీ కార్మికుల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా బీడీ కార్మికులు సంఘాల నాయకులను సన్మానించారు. బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు, ప్యాకర్లు రాజు, మల్లేశం, శ్రీనివాస్, కవి, సునిత, స్వప్న, ప్రకాశ్, ఎల్లగౌడ్, వేణు, సాయి, గోపాల్ తదితరులున్నారు.

ఐపీ నోటీసులు పంపిన పూజారి

వేములవాడ: వేములవాడ పట్టణం మార్కండేయనగర్‌లో ఉంటున్న పూజారి రూ.2కోట్లతో ఉడాయించిన విషయం తెలిసిందే. ఇటీవల వేసవి సెలవులు ముగిసి కోర్టులు పునర్ ప్రారంభం కావడంతో శుక్రవారం పూజారి పేరుతో దాదాపు 8 మందికి ఐపీ(ఇన్‌సాల్వెన్సీ పిటిషన్) నోటీసులు అందినట్లు తెలిసింది. రూ.1.50కోట్లకు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. దీంతో పూజారి బాధితులు ఆందోళన చెందుతున్నారు. తమ బంధువులు, మిత్రుల నుంచి అప్పులు చేసి పూజారికి ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు.

నవగ్రహాల చుట్టూ శునకం ప్రదక్షిణలు



ఎల్లారెడ్డిపేట: నవగ్రహాల చుట్టూ ఓ శునకం 11 ప్రదక్షిణలు చేసిన సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని గీతామందిరంలో శుక్రవారం చోటుచేసుకుంది. శునకం నవగ్రహాల చుట్టూ 11 ప్రదక్షిణలు చేసిన వీడియోను చిత్రీకరించిన అక్కడ ఉన్న భక్తులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా.. వైరల్‌గా మారింది.

ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులు


కనగర్తిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కోనరావుపేట: ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులతోపాటు నాణ్యమైన విద్యనందిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు వినోద్‌కుమార్ అన్నారు. కనగర్తిలో శుక్రవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని విద్యార్థుల తల్లిదండ్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతుల గురించి వివరించారు. ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు దేవదాస్, మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తాడూర్ గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాధికారి దూస రఘుపతి, పంచాయతీ కార్యదర్శి కవిత, అంగన్వాడీలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: నాగంపేట, దమ్మన్నపేట, నర్మాల, లింగన్నపేట గ్రామాల్లో ఉపాధ్యాయులు ప్రవేశాల కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు బాల ఎల్లయ్య, గంగారాం, మోహన్, సీఆర్‌పీ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు అంజలి, పద్మ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ముస్తాబాద్ మండలం మద్దికుంట గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లతో ఇబ్బందులు


ఇసుక లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్

కోనరావుపేట: ఇసుక ట్రాక్టర్లతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. కనగర్తి మూలవాగు నుంచి శుక్రవారం రెవెన్యూ అధికారులు అనుమతులిచ్చారు. దీంతో కనగర్తితోపాటు చుట్టుపక్కల గ్రామాల ట్రాక్టర్లు ఒక్కసారిగా వచ్చాయి. ఇసుక లోడ్‌తో వేగంగా వెళ్తున్న ట్రాక్టర్లతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఊరి మధ్యలోంచి వెళ్తుండడంతో చిన్నారులు రోడ్డుపైకి వచ్చే అవకాశముందని, దీంతో ప్రమాదాలు జరుగుతాయని వాపోతున్నారు. ఇసుక రవాణాలో నంబర్లు లేని వాహనాలను వినియోగిస్తున్నా, మైనర్లు ట్రాక్టర్లు నడుపుతున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. వ్యవసాయ సంబంధ ట్రాక్టర్లతో ఇసుక రవాణా చేసేందుకు రెవెన్యూ అధికారులే అనుమతులిస్తున్నారని పేర్కొంటున్నారు.

అర్చకుల సమస్యలు పరిష్కరించాలి


గొల్లపల్లిలో మాట్లాడుతున్న అర్చకులు

ఎల్లారెడ్డిపేట: అర్చకులకు ప్రభుత్వపరంగా జీవన భృతి కల్పిస్తూ తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మండల అర్చకుల సంఘం అధ్యక్షుడు గొంగళ్ల ఉమాశంకర్ అన్నారు. రాచర్లగొల్లపల్లిలోని బాలా త్రిపుర సుందరి దేవాలయంలో శుక్రవారం ధూప దీప నైవేద్య అర్చకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉమాశంకర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో నిత్యం ఆలయాల్లో ధూప దీప నైవేద్యకులుగా పని చేస్తున్న అర్చకులను ప్రభుత్వం గుర్తించాలన్నారు. స్థానికంగా ఆలయ కమిటీలు ఇచ్చే గౌరవ పారితోషికం కుటుంబాల పోషణకు సరిపోవడం లేదని అన్నారు. దీనికి తోడు ప్రభుత్వపరంగా వేతనాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు భీటుకూరి నవీన్‌చారి, కార్యదర్శి భీటుకూరి వేణుగోపాలచారి, కోశాధికారి మరింగంటి పురుషోత్తమాచారి, అర్చక సభ్యులు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరణ


తంగళ్లపల్లిలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై డి.సుధాకర్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండల కేంద్రంలోని మండెపల్లి చౌరస్తాలో తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్ పోలీస్ సిబ్బందితో కలిసి మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న సిరిసిల్ల పట్టణంలోని కల్యాణలక్ష్మి గార్డెన్‌లో నిరుద్యోగులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఎస్సై చంద్రమౌళి, హెడ్ కానిస్టేబుళ్లు పరమేశ్, మల్లేశ్, కానిస్టేబుళ్లు సంపత్, రామ్మోహన్, గ్రామ యువకులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13న సిరిసిల్లలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని గంభీరావుపేట ఎస్సై రామ్మోహన్ కోరారు.

డిగ్రీ కళాశాల నూతన భవన నిర్మాణానికి లేఖ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అన్ని మౌలిక వసతులతో నాణ్యమైన విద్యాబోధన చేస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ వీర ప్రభాకర్ అన్నారు. కళాశాలలో శుక్రవారం స్థానిక ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాల ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతోందని, నూతన భవన నిర్మాణం కోసం ఇటీవల ప్రభుత్వం నుంచి అనుమతులు ఇస్తూ లేఖ వచ్చిందన్నారు. వచ్చే విద్యాసంవత్సరం లోపు నూతన భవనం అందుబాటులోకి వస్తుందని అన్నారు. కళాశాల భవనం ఆరు ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం చేయాల్సి ఉంటుందన్నారు. రాత్రిపూట విద్యార్థులు బయటకు వెళ్తే విద్యుత్ సౌకర్యం లేదని, ప్రత్యేకాధికారితో మాట్లాడి దీపాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిరుపేద విద్యార్థులు డిగ్రీ కళాశాలలో చేరి అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్యను పొందాలని కోరారు. బాల్‌రాజు, కార్యదర్శి దేవరాజు, అధ్యాపకులున్నారు.

అభివృద్ధికి ముందుకు రావడం అభినందనీయం

చందుర్తి(వేములవాడ): జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లిన చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన పలువురు గ్రామాభివృద్ధిలో మేము సైతమంటూ ముందుకు రావడం అభినందనీయమని చందుర్తి జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ అన్నారు. 64 మంది గ్రామస్తులు బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లి గ్రామానికి తమవంతు సహకారాన్ని అందించాలనే ధ్యేయంతో బాడీ ఫ్రీజర్‌తోపాటు పాఠశాలకు సైన్స్ బోర్డులను శుక్రవారం అప్పగించారు. జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ.. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు తమవంతు ఆర్థిక సాయాన్ని అందిస్తూ దుబాయ్‌లో ఉన్నవారందరూ కలిసి అండగా నిలవడం హర్షణీయమన్నారు. చందుర్తి ఎస్సై శ్రీకాంత్, వైస్ ఎంపీపీ మందాల అబ్రహం, శ్రీనివాస్, వెంకటేశం, మధు , లచ్చయ్య, బాబు, సుధాకర్, నరేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మాదిగలు చైతన్యం కావాలి

సిరిసిల్లటౌన్: రాజకీయంగా.. ఆర్థికంగా.. సామాజికంగా వెనకబాటులో ఉన్న మాదిగలు చైతన్యులు కావాల్సి ఉందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో విలేకరులతో మాట్లాడారు.